# రాలిపోయిన పూలు

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

రాధ ఎవరు? నేను ఎవరు? అనూరాధ ఎవరు? మా ముగ్గురికీవున్న సంబంధము ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబు బయటకు చెప్పలేనేమో! కానీ అంతర్గతంగా ఏదో వ్యధ నా మనస్సును కలచివేస్తూ యుంటుంది. అప్పుడప్పుడు ఏకాంతంగా నేను వీరిద్దరి గురించి విషాద బాష్పాలు రాల్చటంకూడాకద్దు. అయితే నన్ను నేను సమాళించుకొని కళ్లు తుడుచుకొనేవాడిని. ఈ అబలల దీన చరిత్ర నా హృదయ ఫలకంనుండి తుడిచివెయ్యలేకపోయేను. ఎందుకో ఈ ఆరాటం?

♦ ♦ ♦

రాధ నాకు వరుసకు మేనత్త కూతురవుతుంది. నేను పదిహేను సంవత్సరాల వయస్సులో ఫిఫ్తుఫారం చదువుతున్నప్పుడు, ఆ అమ్మాయికి పది సంవత్సరములు. నాలుగవ తరగతి చదువుతూ వుండేది. ... అంత అందగత్తె కాదు. అలా అని అనాకారి మాత్రం గాదు. నల్లగా కొంచము బొద్దుగా వుండేది. కళ్ళు మాత్రం పెద్దవి.

రాధ తండ్రికి కొంచము పిత్రార్జితము వుండగా మొదట స్కూలు మేష్టరుగిరీచేస్తూ, అది నచ్చక పౌరోహిత్యం స్వీకరించి జీవయాత్ర గడుపుకొస్తున్నాడు.

రాధ స్కూలుకు వెళుతూ మా పెద్దనాన్నగారింట్లో దూరి బాదంకాయలు ఏరుకొని పోతూవుండేది. బాదంకాయలకోసం రోజూ మాకు తగువే! నేను మా పెద్దనాన్నగారింట్లోవుండి చదువుకొనేవాడిని. మా పెద్దనాన్న డాక్టరు.

మా పెద్దనాన్న అప్పుడప్పుడు రాధతో యిలా అనేవాడు — "ఏం రాధా! నువ్వు "బాజీని" పెళ్ళాడుతావా? లేక గోపాలుని పెళ్ళాడుతావా? రాధ మనస్సు ఎప్పుడు గోపాలునిమీదే యుంటుంది ... ఏమంటావ్."

రాధ నవ్వుతూ జవాబు చెప్పకుండా పువ్వులు, బాదంకాయలు ఏరుకొని తుర్రుమని తూరీగలాగ పారిపోయేది.

గోపాలుడు మా పెద్దనాన్నగారి అబ్బాయి. నాకంటె వయస్సులో ఒక సంవత్సరము చిన్న, నా పేరు బాజీ ... నేను ఎక్కువ అల్లరిచేస్తానట, అందుచేత "అల్లరి బాజీ" అని పిలిచేవాడు.

మా పెద్దనాన్నవద్దకు మందులకు, ఇంజక్షన్లకు రోజూ చాలమంది వచ్చేవారు. వాళ్ళలో ఎవరయినా సైకిలుమీదవచ్చి సైకిలు చేరబెట్టి లోపలికి వెళ్లేరంటే వారి సైకిలు అక్కడ వుండేదికాదు. నేనో మా గోపాలుడో తీసుకొని నాలుగు చక్కరులుకొట్టి ఆ సైకిలుగల ఆసామిని ముప్ప తిప్పలుపెట్టి మూడు చెరువులునీళ్లు త్రాగించేవాళ్ళము. అప్పుడే మేము క్రొత్తగా సైకిలు నేర్చుకొనేవాళ్ళము. ఒకమాటు గోపాలుడు సైకిలు త్రొక్కుతూ రోడ్డుకు ప్రక్కగా స్కూలునుండి యింటికి వెళుతున్న రాధ కాళ్ళమీదనుండి సైకిలు పోనిచ్చేడు. ... పాపం ఆ అమ్మాయి పడిపోయింది. ... నుదుటిమీద గాయంతగిలి రక్తం స్రవించడం మొదలు పెట్టింది. పరుగున మా పెద్దనాన్న వచ్చి యింటికి తీసికెళ్లి మందువేసి గాయం మాన్పగలిగేడేగాని ఆ మచ్చను మాత్రం మాన్పలేకపోయేడు. ఆ మచ్చ శాశ్వతంగా వుండిపోయింది. రాధను మాత్రం వాళ్ళ తల్లి దండ్రులు ముద్దుగా చూసేవారు. కారణం! లేక లేక పదిసంవత్సరముల తరువాత కల్గిన ముద్దుబిడ్డ కావడంచేత! క్రమేపి ఒక చెల్లెలు ఒక తమ్ముడు కలిగేరు రాధకి.

♦ ♦ ♦

అనూరాధ ప్లీడరు రమణారావుగారి ఏకైక పుత్రిక. నేను ఫిఫ్తుఫారం చదువుతున్నప్పుడు ఆమె

తర్జభార్జం చదువుతూ యుండేది. యవ్వనము తొంగి చూస్తూయున్న పన్నెండు సంవత్సరముల వయస్సులో ఆనందముగా -చీకు చింతా లేకుండా చదువుకుంటూ యుండేది.

ప్లీడరు రమణరావుగారి యిల్లు మా పెద్ద నాన్నగారి యింటికి మూడో యిల్లు. నేను అతనిని మామయ్యా అని పిలుస్తూ చనువుగా తిరిగేవాడిని. మా పెద్ద నాన్నగారు,రమణరావుగారూ స్నేహితులు. ప్రతిదినము సాయంత్రము ఐదుగంటలకు యిద్దరూ పిచ్చాపాటి చెప్పుకుంటూ చల్లగాలిలో వారధిమీద కూర్చుండేవారు. ఏ అర్జంటుకేసో వచ్చి మా పెద్ద నాన్న యింటికివచ్చేవారు. వకీలు మామయ్యగారు ఏరీడింగురూములోనో, ఏటౌను హాలులోను ఒకటి రెండు గంటలుగడిపి యిల్లు చేరుకునేవారు.

అనూరాధ రోజూ మా పెద్ద నాన్నగారింట్లో చాలా కాలము గడిపేది. మా దొడ్డమ్మను అత్తయ్యా అని పిలుస్తూ పెరట్లో పూసిన పువ్వులు ఏరుకొని జడ వెయ్యమని అల్లరిచేసేది. దొడ్డమ్మ విసుక్కోకుండా చక్కగా తలదువ్వి కాటుకపెట్టి "అనూ! నీకు పెంకిమొగుడు దొరుకుతాడులే! నీ అల్లరి అంతా అణుస్తాడులే" అని నవ్వుతూ అనేది. సిగ్గుతో తల వాల్చుకొని ఇంటికి వెళ్ళిపోయేది. స్కూలు పాఠాలు జాగ్రత్తగా చదువుతూ తెలివైనపిల్ల అని పేరుపడ్డది.

అంతవరకూ చదువుతూవున్న నవల కిందపడేసి, ఒకనాడు బేటుకుగట్ అల్లుకుంటూ యున్నాను.

ఎప్పుడు వచ్చిందో అనూరాధ అక్కడవున్న నవలుతీసి పేజీలు త్రిప్పుతూ.

"బాజీ, నువ్వు నవల్సు ఎప్పుడూ ఎందుకు చదువుతావు? అవి చదువుతే పిల్లలు చెడిపోతారని మా మాష్టారు చెప్పేరే?"

"అవి నాకు యిష్టము."

"మరి స్కూలు పుస్తకాలు చదవకపోతే మార్కులురావు. పరీక్ష ఫెయిలు అవుతావు"

"నేను ప్రతి సంవత్సరం పరీక్ష ప్యాసు అవుతున్నానా! అనూ! ఆ సంగతి నీ కెందుకుగాని ఏం యిలా వచ్చేవ్?

"నా కలర్ పెన్సిల్ బాక్సు ఎక్కడో పారేశాను. మా జాగ్రఫీ మాష్టారు హిందూదేశముమేపు రంగులతో వెయ్యమన్నారు. నీ కలర్ పెన్సిల్ బాక్సు ఒకమాటు యిస్తావా?"

లేచి షెల్ఫులోవున్న కలర్ బాక్సు యిచ్చాను.

తుర్ మని పారిపోయింది.

"పిచ్చిపిల్ల" అనుకున్నాను.

♦ ♦ ♦

కొన్ని వసంతాలు గడిచేయి. ప్రకృతిలోనూ ... నాలోనూ, ... నా చుట్టూవున్న వాతావరణంలోనూ చాలా మార్పులొచ్చేయి. నేను చదువుకున్నవూరు జిల్లా ముఖ్య పట్టణం అవడంవల్ల ఒక్కసారి పెరిగిపోయింది.

నాకు ఎక్కడో విసిరేసినట్టు దూరంగా ఒరిస్సాలో రైల్వేలో వుద్యోగం దొరికింది. వివాహమయింది - సుపుత్రప్రాప్తి కలిగింది. నేనూ, నా భార్య, కుమారుడూ అక్కడవుంటూ రాష్ట్రింతో పాటు బంధువులకుకూడా దూరమయి జీవితయాత్ర గడుపుకొస్తున్నాము. దూరాభారం! రైల్వే వుద్యోగము అవడమువల్ల తరుచు శలవలు దొరకవు. ఎప్పుడయినా వుత్తరాలువస్తే బంధువులను, స్నేహితులను చూసినంత ఆనందము పొందేవాడిని.

"రాధకి వివాహమయింది ... అత్తవారింటికి వెళ్ళింది. రాధ భర్త అంతగా చదువు సంస్కారముకలవాడు కాదు. అందుచేత తను పుట్టి పెరిగిన పల్లెటూరిలోనేవుండి వ్యవసాయము చూసుకొంటున్నాడు. పాడిపంట కల్గిన సంపన్న గృహస్థులే.

రాధ సుఖపడవచ్చు" అని తమ్ముడు గోపాలుడు వుత్తరము రాసేడు. పోనీ సుఖపడ్డది గదా అని అనుకున్నాను. అనూరాధ విషయం యేమీ తెలియలేదు.

◆ ◆ ◆

ఒకనాటి సాయంత్రము స్టేషనులో తిరుగుతూ వీలరులో పుస్తకాలు తిరగేస్తున్నాను ... ఆ ప్రక్కనే ఇంటరుక్లాసు వెయిటింగురూము వుంది. అప్రయత్నముగా కళ్లు వెయిటింగురూమువేపు తిరిగేయి. ప్లీడరు రమణారావుగారు వెయిటింగురూము ఈజీఛైర్‌లో పడుకొని రైల్వేగైడు తిరగవేస్తున్నారు. లోనికి వెళ్లేను.

"నమస్కారం మామయ్యగారూ"

నన్ను చూసి పోల్చుకోలేకపోయేరనుకుంటా - 4, 5 సంవత్సరములు గడిచేయి నన్ను చూసి. నాలో చాల మార్పువచ్చియుంటుంది. అందుచేత వెంటనే గుర్తుపట్టలేక ముఖావంగా వుండిపోయేరు.

"నేను బాజీని మామయ్యగారూ" అన్నాను నన్ను నేను పరిచయంచేసుకున్నాను.

"ఓస్! నువ్వటోయి బాజీ!" ఎగిరి గంతేసేరు వకీలుగారు.

"అప్పటికీ యిప్పటికీ చాలా మట్టుకు మారిపోయేవ్. వొడ్డూపొడుగూ ఎదిగేవ్."

నేనూ నవ్వుతూ వూరుకున్నాను.

"రా. కూర్చో. ఇక్కడేం చేస్తున్నావ్ నువ్వు?"

"రైల్వేలో గార్డుగావున్నాను మామయ్యగారూ"

"వెరీగుడ్. చాల బాగుంది. సంతోషం. ప్రయోజకుడివయ్యావ్."

నేను మౌనంగా కూర్చున్నాను.

కొంచెముసేపు నిశ్శబ్దము.

"మీరు ఎటో ప్రయాణమయి ఈ వూరిలో బ్రేక్ చేసినట్లుందే" అని అడిగేను.

"అవునోయ్. కరగ్‌పూర్ వెళదామని పూరి ప్యాసింజరులోవచ్చేను. ఇక్కడ దిగేను. మా అల్లుడు కరగ్‌పూర్‌లో రైల్వేలో పనిచేస్తున్నాడు. అన్నట్లు ఈ సంగతి నీకు తెలుసుకదూ."

"తెలీదు మామయ్యగారూ."

"అవును నాలుగు సంవత్సరాలబట్టి యిటు ప్రక్కవుంటున్నావు. నీకు తెలియకపోవచ్చు. మా అనూరాధను కరగ్‌పూరు యిచ్చేను. అప్పుడే సంవత్సరమయింది అమ్మాయి అక్కడేయుంది. నిన్ననే మా వియ్యంకుడు టెలిగ్రాము యిచ్చేడు అల్లుడికి సుస్తీగా వుంది రమ్మని. గాబరాగా బయలుదేరేను. ఎలా వుంటుందో ..."

మామయ్యగారి ముఖంలో దిగులుకనిపించింది.

"మరేమీ గాబరాపడకండి మామయ్యగారూ! అదే తగ్గిపోతుంది. ఏదో మామూలు జ్వరం అయివుంటుంది. లేకపోతే సీరియస్ అనే యిచ్చేవారు. రండి యింటికి వెళదాము. భోంచేసి రాత్రి యక్స్‌ప్రెస్‌కి వెళ్ళవచ్చును" అని యింటికి భోజనానికి ఆహ్వానించేను.

"ఎందుకోయ్. అనవసరం. నీకెందుకీ శ్రమ! ఇక్కడే ఏదో యింత టిఫిను తింటానులే."

"అదేమిటి మామయ్యగారూ! అలా అంటారు. ఇందులో నాకు శ్రమ ఏముంది చెప్పండి. రాక రాక ఈ వూరు వచ్చేరు ... ఈ విధంగానైనా మా యింట్లో భోంచెయ్యడం మీకు తటస్థించింది. నన్ను పరాయి వ్యక్తికింద తీసుకోకండి" అని బలవంతము చెయ్యగా మామయ్యగారు ఒప్పుకున్నారు. ఆ రాత్రి మామయ్యగారు మా యింట్లో భోంచేసి ఎక్స్‌ప్రెస్‌కి వెళ్లేరు.

◆ ◆ ◆

ఒకమాటు దొడ్డమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రాము వచ్చింది. వెంటనే మూడు రోజులు శలవు తీసుకొని వెళ్లేను. భగవంతుని దయవలన నేను వెళ్లేసరికి ఆమె వొంట్లో కులాసాగాయుంది. నేను పెద్ద

నాన్న కష్ట సుఖాలు రెండు మూడు గంటలు మాట్లాడేము. ఎలాగు వచ్చేనుగదా తెలిసినవారందరి యిండ్లకు వెళదామని నిశ్చయించేను.

రాధ యింటికి మొట్ట మొదట వెళ్ళేను.

"ఏం ఓయ్! బాజీ ఎప్పుడు వచ్చేవు? రా కూర్చో!" అంటూ రాధ తండ్రి నాకు మర్యాద చేస్తూ కుర్చీ చూపించేడు. అప్పుడు మధ్యాన్నము రెండు గంటలు అయివుంటుంది.

"ఏమే! బాజీ వచ్చేడు. పెద్ద వుద్యోగస్తుడయ్యాడు. కొంచము కాఫీ తీసుకురా" అని యింట్లో భార్యకు కేక వేసేడు.

కుర్చీలో కూర్చుంటూ "ఇప్పుడు కాఫీవద్దు. ఇందాకనే త్రాగేను" అన్నాను.

"ఏమోయ్ ఎప్పుడు వచ్చేవు? పోనీ మా మీద ప్రేమవుండబట్టి చూడడానికయినా వచ్చేవు."

"దొడ్డమ్మకు సీరియస్‌గా యుందని టెలిగ్రాము వస్తే నిన్న వుదయము వచ్చేను."

"ఎలావుంది ఆవిడ శరీరస్థితి?"

"ఇప్పుడు బాగానేవుంది."

"పోనీలే నాయనా - పెద్దల ఆశీర్వచనములవల్ల ఆ భగవంతుని దయవలన వెయ్యేళ్లు బతకాలి ఆమె" అంటూ కాఫీ తీసుకొచ్చింది అత్త.

"మొదట కాఫీ త్రాగు ... చల్లారిపోతుంది" అంటూ మామయ్య కాఫీ త్రాగమని బలవంతము చేసేడు.

కాఫీ గ్లాసు ఖాళీ చేసేను.

"రాధని అత్తారింటికి పంపేరటగా! గోపాలుడు వుత్తరము రాసేడు. ఈ మధ్యగానివచ్చిందా?" అని అడిగేను.

"ఏం రాధో ఏం లోకమో నాయనా! ఏం చెప్పడం! ఎలా చెప్పడం? ఇంతకీ ఆ దరిద్రుడిని అనాలి. ఒకరి ననవలసినపనిలేదు. దాని నుదుట యిలా రాసేడేమో ఆ బ్రహ్మ! మూడు నెలలయింది ఇక్కడేవుంది. దానికి అత్తవారింట పెట్టే బాధ యింతా అంతా అని చెప్పలేము. భరించి భరించి మరి భరించలేకపోయింది. రాత్రి రాత్రి ఎవరూ చూడకుండా ఎవరికి చెప్పకుండా ప్రాణానికి తెగించిన సాహసంతో ఈ పన్నెండుమైళ్లు నడిచి వచ్చేసింది" అంది రాధ తల్లి కంటతడిపెడుతూ.

"వాడు ఒక స్కౌండ్రల్—విస్వాసఘాతకుడు! ఏదో తినడానికి యిన్ని గింజలొస్తున్నాయి; వుండడానికి ఒక కొంపవుంది. ఈ కాలము చదువుకున్నవాళ్లకి యింతకన్న ఎక్కువవుండి ఏడ్చిందా ఏమిటి? పిల్ల సుఖపడుతుందని ఈ సంబంధము చేసేను. కాని ఇలా వాడు పాములాగ కరుస్తాడని అనుకోలేదు. వాడికి యిద్దరు అక్కలువున్నారు. ఒక ఆమె విధవ. ఇంకొక ఆమెను భర్త వదిలిపెట్టేడు. వీళ్లిద్దరు యిక్కడ తిష్టవేసేరు. వీళ్లు రాధమీద అజమాయిషీ చెలాయిస్తూ వుంటారు. వాళ్లు చెప్పినదానికి తల్లి తాళంవేస్తూ యుంటుంది. ఈ మూర్ఖుడు వీళ్ళ ముగ్గురి మాటలువిని రాధని నానా బాధలు పెట్టేడు. పాపాత్ముడు చెయ్యకూడా చేసుకుంటూయుండేవాడు.

మీ వాళ్లకు గతిలేదు - నీకు ఏమీపెట్టలేదు - ఇంత నీచమయినవాళ్లని అనుకోలేదు - ఇంత లోభులేమిటి - ఇలాంటి సూటిమాటలతో దాన్ని రోజూ పొడిచేవాడు. నేనేం జమీందారునా ఏమిటి వున్న ఎస్టేటురాయడానికి! - పాపం భరించింది రెండేళ్లు భూదేవిలాగ. మరి భరించలేకపోయింది. కుమిలి కుమిలి యేడ్చేది. ఆఖరికి చెప్పకుండా ప్రాణభయానికి వెఱచి వచ్చేసింది. ... పంపమని రెండు వుత్తరాలురాసేడు. పంపితే చంపుతాడేమో ... మా ప్రాణానికి వునూరుమని చస్తుంది. యేంచెయ్యడానికి తోచలేదు. ఆఖరికి మరి పంపకుండా వుండడానికే నిశ్చయించాను.... మొన్ననే ట్రయినింగు స్కూలులో ప్రవేశపెట్టేను. అదేదో అయిపోతే తన బ్రతుకు

తనే బ్రతుకుతుంది ... మరేం జేస్తాము? మగపిల్ల వాడు అని అనుకుంటాను. ఏమంటావ్ బాజీ-?" అన్నాడు రాధ తండ్రి.

కళ్ళంట నీరు కారుతున్నాది. వ్యధ మాటలలో వ్యక్తీకరిస్తున్నాది.

అప్పుడే రాధ స్కూలునుండి కాబోలు వచ్చింది పుస్తకాల చేతితో. నన్ను ఒక క్షణంచూసి ముఖం దించేసి ఇంట్లోనికి వెళ్ళిపోయింది.

ఆ ఖిన్నవదనంలో "నా బాధలు ఏంచెప్పమంటావ్" అన్న మాటలు నాకు స్ఫురించేయి.

నేను ఏస్థితిలోవున్నానో నాకే తెలియదు. కుర్చీలో కొయ్య అయిపోయివుంటాను. "ఇంత చిన్న వయస్సులో యిన్ని బాధలా! ఆనందముగా చీకు చింతా లేకుండా బ్రతకకుండా ఈ అవస్థలేమిటి? పందొమ్మిది వందల ఏభయి ఆరులోకూడా యిటు వంటి మూర్ఖపు భర్తలు వున్నారా? ఈ దీనురాలి జీవితం ఇంత వక్రంగా తిరుగుతుందని ఎప్పుడు అనుకోలేదు"

బరువుగా లేస్తూ "వస్తాను" అని బయలుదేరేను కాళ్ళీడ్చుకొంటూ శ్రతిజబాబు ఆశించకుండానే.

◆ ◆ ◆

జీవితంలో మార్పులేదు... వుద్యోగంలో వుండాలని లేదు. బృహన్నల నడవడానికి బలవంతముగా చేస్తున్నాను. క్రొత్తయేమీలేదు .. రోజూ ఒకే టైమ్ టేబిల్. తీరుబాటుకాలం ఇంట్లో సుజాత తోను అబ్బాయి మధుతోను గడుపుతున్నాను. దేశం కాని దేశంలో మిత్రులులేరు. తెలుగు పత్రికలు కూడా సాధారణంగా దొరకవు. చస్తున్నాను. బ్రతుకుబరువుగా గడుస్తోంది.

అప్పుడప్పుడు రాధ విషాదజీవితం హృదయంలో ప్రవేశిస్తోంది. బలవంతముగా తుడిచివేస్తూయున్నాను.

ఒకనాడు యింటికి వచ్చేసరికి సుజాత కవరు అందించింది. తమ్ముడు గోపాలుడు రాసినట్టుంది. కవరు విప్పేను.

"అన్నయ్యా"

"......... అమ్మ శరీరస్థితి మళ్ళీ బాగులేదు. ... నాకూ యింతవరకు ఏదీవుద్యోగము కలిసిరాలేదు... ఆర్థికపరిస్థితులు ఏమీ బాగులేవు ... పోనీలే యివి ఎప్పుడువున్నవే."

"అనూరాధ యిక్కడేవుంది... పాపం అనూరాధ యిప్పుడు ... విధవ. ప్లీడరు మామయ్యగారు చాల డబ్బు ఖర్చు చేసేడు. అనురాధ మామకూడ దగ్గర దగ్గర పాతికవేలు డాక్టర్లకి పోసేడు. "శానిటోరియంలో కూడ కొన్నాళ్ళువుంచారు... కాని ఫలితం ...శూన్యం. ఇటుతలిదండ్రులకు, అటు భార్యకు, అత్తవారిని శోకసాగరంలో ముంచి అనురాధ భర్త టి. బి తో అస్తమించేడు. ఇకమిగిలింది గట్టులేని విచార ప్రవాహంతోవున్న అనురాధ. అన్నయ్యా ఆ అమ్మాయి విచారవదనం చూడలేక పోయేనను కో ఇలా అవుతుందని కలలోకూడా వూహించేమా? కొన్ని నెలలు మాత్రమే సంసారసుఖంఅనుభవించింది... విధి బలీయము కదూ........."

కళ్ళంట నీళ్ళుధారా ప్రవాహంగా కారిపోతున్నాయి. సుజాత నీళ్లు చీరకొంగుతో తుడిచింది. ఇటు రాధ ... అటు అనూరాధ ... వీళ్ళ భావి జీవితాలు కటికచీకటులు.

"అదేమిటండీ అలాకంటనీరు పెడుతున్నారు" అని అడిగింది. సుజాత.

నిశ్శబ్దముగా వుత్తరం అందించేను. చదివిందీ వుత్తరము. "ఎవరయితే నేం సుజాతా! ... ఈ భారత దేశంలో యిలాంటి అభాగ్యవనితలు చాల మంది వున్నారు. వీళ్ళ భావి జీవితం గాడాంధకారమయం. వీళ్ళలో చాలమందికి మళ్లా సంసారసుఖం అనుభవిద్దామని, మళ్లా వివాహం చేసుకుందామని వుండదు. ఇది భారత నారీమణుల ప్రత్యేకత. సర్వ విధముల భర్తనేనమ్మియున్న భారత స్త్రీకి భర్త గతించిన తరువాత జీవితం శూన్యం. అందుచేత

ఆమె మిగతాకాలం భగవన్నామ స్మరణతో పూజలతో కాలము గడుపుతుంది. ఇప్పుడిప్పుడు కొందరు ద్వితీయ వివాహం చేసుకుంటున్నారు. అలాంటివారలను చూపించి సంఘము వేలుచూపుతుంది. లోకం వాగుతుంది. మగవాడికా ఆ బాధ లేదు. భార్యను వదలిగాని, భార్యగతించేకగాని ద్వితీయవివాహం చేసుకోవచ్చు. సంఘమే దానికి దారి చూపుతుంది. లోకం హర్షిస్తుంది ......... పాపం ... ఈమె నాస్నేహితురాలు ... సోదరి కంటె ఎక్కువగా భావించేవాడిని. ఈమె వివాహ మాడదలిస్తే సంఘం తప్పక ప్రోత్సహించాలి"

నా కళ్ళనుండి జారిన వేడి కన్నీటి కణాలు చూస్తూ స్తబ్దులాగ నిలబడిపోయింది సుజాత.

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3-0-0

అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.

మెదడును చల్లబరచి,
శిరోజములను నల్లబరచి,
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2-0-0

వాడిచూడండి.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.